క్లుప్తంగా

కృష్ణా కాలేజీ అధ్యాపకుడు శివప్రసాద్‌కు బెస్ట్ టీచర్ అవార్డు



మద్దిలపాలెం: సీఎస్‌సీ, నీతి ఆయోగ్ ఇండియా ప్రదానం చేసే ఎక్సలెన్స్ ఇన్ బెస్ట్ టీచర్ అవార్డు డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు డాక్టర్ ఎ.శివప్రసాద్‌కు లభించింది. ఈ నెల 5న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన జాతీయ స్థాయి ఉత్సవంలో వర్చువల్‌గా ఆయనకు అవార్డు ప్రదానం చేశారు. సీఎస్‌సీ ఇండియా సీనియర్ లెర్నింగ్ కన్సల్టెంట్ వై.రామ్మోనహరావు మాట్లాడుతూ డాక్టర్ శివప్రసాద్ డిగ్రీ విద్యా రంగంలో చేసిన దీర్ఘకాలిక కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం శివప్రసాద్‌ను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సీటును తూర్పు కాపులకు కేటాయించాలి



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థిగా తూర్పు కాపులకు సీటు కేటాయించాలని ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొర్లె శ్రీనివాస నాయుడు డిమాండ్ చేశారు. మద్దిలపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో కూటమి కూర్పు సందర్భంగా తూర్పు కాపుల సీట్లను ఇతర సామాజిక వర్గం అభ్యర్థులకు కేటాయించటం వల్ల నెల్లిమర్ల, ఎచ్చెర్ల సీట్లు కోల్పోయారన్నారు. ఏ పార్టీ తూర్పు కాపులకు సీటు ఇస్తుందో వారికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో ఉత్తరాంధ్ర తూర్పు కాపు సామజిక వర్గం నాయకులు బలగ సుధాకర్, లోగిస గణేష్, రెడ్డి వెంకటరమణ, రమణ పాల్గొన్నారు.

ఆర్టీసీ వైస్ చైర్మన్‌కు అభినందన



ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నంతో ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రతినిధులు

మద్దిలపాలెం: ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.ఎస్.మునిరత్నంను సోమవారం విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను గజమాలతో సత్కరించి అభినందించారు. ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, విజయవాడ జోనల్ కార్యదర్శి అడపా రామారావు, కార్యదర్శి ఇ.ఎ.రామకృష్ణ, గుంటూరు జిల్లా చైర్మన్ సుబ్బారావు, అన్ని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు ఆర్టీసీ వైస్ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

తీరంలో గుర్తు తెలియని మృతదేహం



వ్యక్తి మృతదేహం

బీచ్‌రోడ్డు: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆర్కేబీచ్ కాళీ మాత దేవాలయం మెట్లు వద్ద గుర్తించారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ప్రకారం సుమారు 50 ఏళ్లున్న వ్యక్తి మృతదేహం సోమవారం ఆర్కే బీచ్ వద్ద కాళీమాత దేవాలయం వద్ద స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా అతడి వద్ద మందులు ఉన్నాయని, అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ప్రాథమిక విచారణలో తేలింది. మరేం వివరాలు లేకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. అనంతరం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే మూడో పట్టణ పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

అర్బన్ హాస్టల్ అస్తవ్యస్తం

- గాంధీనగర్ వసతి గృహంలో అరకొర సౌకర్యాలు
- 1 నుంచి 10వ తరగతి వరకు 100 మంది విద్యార్థులకు వసతి
- ఇబ్బందులు పడుతున్న బాలలు
- దృష్టి సారించని జీవీఎంసీ అధికారులు



పుస్తకాల పెట్టెపై టీవీ పెట్టి.. నేలపై కూర్చొని, నిల్చుని చూస్తున్న పిల్లల గుంపు



పిల్లలు వినియోగిస్తున్న చిరిగిన చాప



గాంధీనగర్ హాస్టల్ గదిలోని ట్రాక్‌ల్లో పిల్లల పెట్టెలు, వాటిపై ఆరబెట్టిన దుస్తులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లోని జీవీఎంసీ హాస్టల్ అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడ పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేవు. పిల్లలకు వైద్య సదుపాయం లేదు. చిరిగిన చాపలు, దుప్పట్లు, రంగులు మారి నల్లబారిన గోడలు మధ్య విద్యార్థులు గడుపుతున్నారు. పట్టణంలోని మురికివాడల పిల్లలకు ఆసరా కల్పించడానికి సుమారు 12 ఏళ్ల కిందట జీవీఎంసీ ప్రత్యేకంగా నగరంలో పలుచోట్ల హాస్టళ్లు ఏర్పాటు చేసింది. నగరంలోని మురికివాడల పిల్లలను వీటిలో చేర్పించి వారికి విద్య, వైద్యం, వసతి తదితర సౌకర్యాలు కల్పిస్తోంది. ఇందులో భాగంగా 11వ వార్డు గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన వసతి గృహంలో అరకొర సౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

అనేక ప్రాంతాలకు చెందిన పిల్లలు

ఇక్కడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ఓ భవనంలో హాస్టల్ నిర్వహిస్తున్నారు. దీని సామర్థ్యం 100 మంది విద్యార్థులు. నగరంలోని పలు మురికివాడల ప్రాంతాలతోపాటు జిల్లాలోని పలు చోట్ల నుంచి పిల్లలున్నారు. వీరంతా 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల, 6 నుంచి 10వ తరగతి వరకు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వీరికి హాస్టల్‌లో వసతితోపాటు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, అవసరమైన వారికి వైద్యం అందించాల్సి ఉంది. పాఠశాలలకు సెలవుల సమయంలో స్టడీ క్లాస్‌లు నిర్వహించాలి. ప్రతి రోజూ వైద్యులు హాస్టల్ పిల్లలకు హెల్త్ చెకప్ చేస్తుండాలి. ఇవన్నీ విద్యార్థులకు అంతంత మాత్రంగానే అందుబాటులో ఉన్నాయి.

సమస్యలు బోలెడు..

వసతి గృహంలో ఉంటున్న 100 మంది విద్యార్థులు సౌకర్యాల లేమితో నానా ఇబ్బందులు పడుతున్నారు.

➡ హాస్టల్ కింద పోర్షన్‌లో గాలి, వెలుతురు సరిగా తగలదు.

➡ ఈ గదిలో ఏర్పాటు చేసిన టీవీకి ప్రత్యేకంగా స్టాండ్ లేదు. సెలవుల్లో విద్యార్థులు ఈ టీవీని వారి దుస్తుల పెట్టెపై పెట్టి కేబుల్ వైర్లు అమర్చి చూడాల్సిన పరిస్థితి. దూరంగా ఉన్న వారికి కనిపించకవడంతో వారంతా గుంపుగా ఒకే చోట చేరి టీవీలో కార్యక్రమాలు వీక్షించాల్సిందే.

➡ ఈ విషయంలో వెనుకున్న వారికి సరిగా కనిపించడం లేదంటూ తరచూ విద్యార్థుల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

➡ హాస్టల్ భవనం గోడలు రంగులు పోయి నల్లగా మారాయి. హాస్టల్ లోపల ఒకే ర్యాక్‌లో ఇద్దరు ముగ్గురు పిల్లలకు చెందిన పెట్టెలు, పుస్తకాలు, దుస్తులు పెట్టుకోవాల్సిన పరిస్థితి.

➡ హాస్టల్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పిల్లలు తరుచూ దురదలు, జ్వరాలకు గురవుతున్నారు.

➡ సాధారణంగా ప్రతి రోజూ ఇక్కడ విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిశీలించాలి. కనీసం రెండు, మూడు వారాలకు కూడా ప్రత్యేకంగా వైద్య పరిశీలన ఉండటం లేదు. ఎవరికైనా జ్వరం, దురదలు వచ్చినప్పుడు మాత్రమే స్పందిస్తున్నారు.

➡ పిల్లలకు మధ్యాహ్నం పాఠశాలలో మిడ్‌డే మీల్ పెడుతున్నారు. ఉదయం టిఫిన్, రాత్రి భోజనం మాత్రమే హాస్టల్‌లో పెడతారు. మధ్యాహ్న భోజనం ఖర్చు కూడా రికార్డుల్లో రాసి అధికారులకు చూపుతున్నట్లు నిర్వాహకులపై ఆరోపణలున్నాయి.

➡ విద్యార్థులు పడుకునేందుకు చాపలు, దుప్పట్లు కూడా ఇవ్వాలి. ప్రస్తుతం ఇక్కడ పిల్లలు వినియోగిస్తున్న కొన్ని చాపలు, దుప్పట్లు చిరిగిపోయాయి.

అన్నదానాల్లో భోజనం.. రికార్డుల్లో ఖర్చు

ఇదిలా ఉండగా ఇటీవల ముగిసిన వినాయక చవితి నవరాత్రి వేడుకల్లో భాగంగా గాంధీనగర్, తోటగరువు ప్రాంతాల్లో రోజూ అన్నసమారాధనలు జరిగేవి. పాఠశాలలకు సెలవు రోజుల్లో మధ్యాహ్నం భోజనం వినాయక పందిళ్ల వద్ద అన్నదానంలోనే విద్యార్థులకు పెట్టించేవారు. ఈ వ్యవహారం ప్రతి ఏడాది వినాయక నవరాత్రుల్లో జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. అన్నసమారాధనలో భోజనాలు పెట్టించి వాటి ఖర్చు మాత్రం రికార్డుల్లో చూపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిరంతరం పర్యవేక్షించాల్సిన జీవీఎంసీ అధికారులు ఈ హాస్టల్‌పై ఎటువంటి దృష్టి పెట్టకపోవడం విశేషం. ఉన్నతాధికారులు పరిశీలించి హాస్టల్‌ను సక్రమంగా నిర్వహించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన నూతన సీఈవో



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూతన సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో)గా బాధ్యతలు స్వీకరించిన పి.నారాయణమూర్తి సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు.

కేజీహెచ్ ఏడీకి పదోన్నతి



ఏడీ శ్రీనివాస్ కుమార్

మహారాణిపేట: కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ (పరిపాలన) సీహెచ్.శ్రీనివాస్ కుమార్‌కు పదోన్నతి లభించింది. శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డిప్యూటీ డైరెక్టర్ (పరిపాలన)గా నియమించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టీ.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022 మార్చి 30నుంచి కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. పాడేరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్‌గాను, వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు.

మాతృ మరణాలు సంభవిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: మాతృ మరణాలు జరిగితే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ఆయన అధ్యక్షతన మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గత నెలలో రెండు మాతృ మరణాలు సంభవించాయన్నారు. సంబంధిత అధికారులు, వైద్యులు వివరణ ఇవ్వాలని కోరారు. సంబంధిత ఏరియా యూపీహెచ్‌సీ వైద్యులు, ఆశా, ఏఎన్ఎంలు దీనికి బాధ్యత వహించాలని చెప్పారు. ఎవరైనా గర్భిణులు అస్వస్థతకు గురైనప్పుడు వైద్య ఆరోగ్య కార్యకర్తలు ఆమెను వెంటనే డాక్టర్ వద్దకు తీసుకెళ్లి తగిన వైద్యం చేయించాలని సూచించారు. ఇకముందు మాతృ మరణాలు జరగకూడదని డిఎంహెచ్‌వో ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, వివిధ విభాగాల వైద్యులు డాక్టర్ శంకర్‌ప్రసాద్, ఎస్.జీవనరాణి, బి.ఉమావతి, ఎస్.షర్మిలకుమారి, శ్రీదేవి, శ్రవణ్, జి.వి.గణేష్, ఎస్.సి.బి.నాయుడు, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి ఎస్.జయదేవి, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు ఐ.మనోరమ, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు, జిల్లా వైద్యులు పాల్గొన్నారు.

ఎస్సీ నివాస ప్రాంతాల్లో సదుపాయాలపై సర్వే



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: 100 రోజుల ప్రణాళికలో భాగంగా జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల నివాస ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనలో వెనుకబాటుకు గల కారణాలపై ఈ నెల 15లోగా క్షేత్రస్థాయిలో సర్వే చేయించి, నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి తెలియజేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ జిల్లాలోని అన్ని ఎస్సీ నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై సర్వే చేసి, వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు, గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'వయోశ్రీ యోజన' లబ్ధిదారులకు ఉపకరణాల పంపిణీ



వయోవృద్ధులకు ఉపకరణాలు అందజేస్తున్న జి.వి.ఎల్.నరసింహారావు

బీచ్‌రోడ్డు: వయోశ్రీ యోజన పథకంలో భాగంగా 60 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో సోమవారం ఉపకరణాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి రాజ్యసభ మాజీ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 817 మంది వయోశ్రీలకు రూ.44 లక్షల విలువైన 3,083 ఉపకరణాలు అందజేశామన్నారు. ప్రధాని మోదీ దివ్యాంగులు, వయోవృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, వీరికి ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, నెక్ కాలర్, నీ బెల్ట్, నడుము బెల్టులు, లో లెటర్, క్లచ్చస్, ఎల్బో, వాకింగ్ స్టిక్ మొదలైనవి అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి, అలీమ్ కో డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

5 శాతం రిజర్వేషన్ కల్పించాలి

రోడ్డెక్కిన రెల్లి కులస్తులు



ర్యాలీ చేస్తున్న రెల్లి సంఘం నాయకులు

దాబాగార్డెన్స్: రెల్లి, రెల్లి ఉపకులాలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని విశాఖ జిల్లా రెల్లి సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ కూడలి నుంచి డాబాగార్డెన్స్, ప్రెస్‌క్లబ్ జంక్షన్, ప్రకాశరావుపేట, జగదాంబ జంక్షన్ మీదుగా కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఈ ఏడాది ఆగస్టు ఒకటిన కీలక ప్రకటన చేసిందని, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఏ,బీ, సీ,డీ కేటగిరీగా వర్గీకరించవచ్చని తీర్పు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఉన్న రెల్లి, రెల్లి ఉపకులాల దుర్భర జీవన విధానం, వెనుకబాటుతనం పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని, గతంలో రెల్లి కులస్తులకు కల్పించిన ఒక శాతం రిజర్వేషన్ ఉపయోగకరంగా లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభాలో 10 లక్షల మంది రెల్లి కులస్థులు ఉండగా, తక్కువ శాతంగా చూపించి ఒక శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. నవ్యాంధ్రలో రెల్లి, రెల్లి ఉపకులాలు అధిక శాతంలో ఉన్నారని, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా వెనుకబాటు తనంపై పరిగణనలోకి తీసుకుని 5 శాతం రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఆడమ్స్, ఎస్ కల్యాణముని, వడ్డాది మధుసూదన్, ఇంటి గురుమూర్తి, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, బంగారు ఈశ్వరరావు, చెన్నా పాల్, వడ్డాది ప్రకాష్, సురుపల్లి మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదిపరాశక్తీ నమోస్తుతే..



ఎంవీపీలో మహిషాసుర మర్థినిగా అమ్మవారు



కరకచెట్టు పోలమాంబ అలంకరణలో దుర్గాదేవి



చండికాదేవికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-9లో సాయి దుర్గా ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గాదేవి మహిషాసుర మర్ధినిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.చలపతి, కార్యదర్శి కె.చంటి, బుల్లిబాబు, నారాయణ, సన్యాసిరావు, నగేష్, అప్పారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

కరకచెట్టు పోలమాంబగా దుర్గాదేవి

శ్రీ పోలమాంబ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు కరకచెట్టు పోలమాంబగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం జసాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ ఈవో కె.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

చండికాదేవికి ప్రత్యేక పూజలు

ఎంవీపీ కాలనీ సెక్టార్-4లోని చండికాదేవి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన, అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన చండీ హోమంలో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ వెలుగులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళా భక్తుల భజన, కోలాటం బృందం చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నవరాత్రులు ముగిసే వరకు నిత్యం పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ తెలిపారు. కమిటీ ప్రతినిధులు శ్రీహరిరాజు, ఉమాదేవి, శ్రీనివాసరావు, రామమోహనరావు, కొండలరావు, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పూజ రేపు

బీచ్‌రోడ్డు: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కిర్లంపూడి లేఅవుట్‌లో వెలిసిన లలిత సుందరేశ్వరి ఆలయంలో ఈ నెల 9న సరస్వతీ పూజ నిర్వహించనున్నట్లు ఆలయ పర్యవేక్షకుడు కాండూరి లక్ష్మణ స్వామి తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 7.30 గంటలకు చిన్నారులకు సరస్వతి మంత్రం, బీజాక్షర అర్చన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. సాయంత్రం 6 గంటలకు బాలలతో సరస్వతీ పూజ చేయిస్తామన్నారు. చిన్నారులందరూ పాల్గొనాలని కోరారు.

జోన్-2 పీజీఆర్ఎస్‌కు 7 వినతులు

మధురవాడ: మధురవాడ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఏడు వినతులు వచ్చాయి. జెడ్సీ సింహాచలం దరఖాస్తులు స్వీకరించారు. పీఎంపాలెం ఎస్‌కే సీజీపీ కాలనీలో రోడ్లు, కాల్వల మరమ్మతుల గురించి వెదిలి బలరామకృష్ణ తదితరులు, పీఎంపాలెం ప్రశాంతి టవర్స్ అపార్ట్‌మెంట్‌కు ఇంటి పన్ను వేయాలని సీనియర్ సిటిజన్ సర్వదేవుళ్ల వినతులు అందించారు. ఆరో వార్డులో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని టీడీపీ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు కోరారు. మధురవాడ సర్వే నెంబరు.151/10ఏలో రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని విజయ భాస్కరరావు ఫిర్యాదు ఇచ్చారు.

ఘనంగా దుర్గాదేవి సారె ఊరేగింపు



పీతలవానిపాలెంలో సారె ఊరేగిస్తున్న భవానీ మాలధారులు, స్థానిక మహిళలు



పూజలందుకున్న దుర్గాదేవి

మద్దిలపాలెం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పీతలవానిపాలెంలో అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణా యువజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో భవానీ మాలధారులు, స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గాదేవి సారె ఊరేగింపును మేళతాళాల నడుమ వైభవంగా నిర్వహించారు. పీతవానిపాలెం, పిఠాపురం కాలనీ, శివాజీపాలెం గ్రామాల మీదుగా ఊరేగింపు సాగింది.

'100 రోజుల పాలనలో చేసిందేంటి..'

మద్దిలపాలెం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా 100 రోజుల పాలనలో ఏం చేశారో ప్రజలకు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగన్ మురారి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో భాగమైన పవన్ కల్యాణ్ అమరావతి రాజధాని పనులను పర్యవేక్షిస్తున్నారన్నారు. గతంలో రాష్ట్రంలోని రహదారుల మీద పెద్ద ఎత్తున ఆందోళన చేసిన జనసేన.. ఈ 100 రోజుల్లో కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న మీరు రహదారుల మరమ్మతుల కోసం ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదన్నారు. 36 వేల మంది ఆడపిల్లలు రాష్ట్రంలో కనిపించకుండా పోయారని ఆరోపించి, వారి రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో స్పష్టం చేయాలన్నారు. తమకు పట్టం కడితే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామని చెప్పి.. నేడు కార్మికులను ఇబ్బంది పెట్టేలా కేంద్రం కుయుక్తులు పన్నుతుంటే మౌనంగా ఎందుకు ఉంటున్నారని ప్రశ్నించారు. తిరుపతి లడ్డూ దగ్గర మొదలైన పోరాటం.. దానిని పరిష్కరించకుండా సనాతన ధర్మం వైపు ఎందుకెళ్లిందని ప్రశ్నిచారు. ఉచిత ఇసుక ఏమైంది, సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడికి పోయాయో తెలపాలని జగన్ మురారి డిమాండ్ చేశారు.

పాలస్తీనాకు అండగా ఉందాం



ప్రదర్శనలో వామపక్ష నాయకులు, కార్యకర్తలు

సీతమ్మధార: పాలస్తీనాకు అండగా ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఇతర వామపక్ష పార్టీల నాయకులు విజ్ఞప్తి చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయల్ మారణహోమం సృష్టించి ఏడాదైనా ఇంకా అక్కడ పరిస్థితులు మారలేదన్నారు. ఐక్యరాజ్య సమితి అక్కడ శాంతి నెలగొల్పాలని కోరారు. సోమవారం లలితా జ్యుయలర్స్ నుంచి ఆశీల్‌మెట్ట జంక్షన్ వరకు శాంతి ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, పైడిరాజు మాట్లాడుతూ ఇజ్రాయల్ దాడుల్లో జరిపి 42వేల మంది మృతి చెందారని, ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం ఖండించలేదన్నారు. అమెరికా అండదండలు చూసుకొని ఇజ్రాయల్ పేట్రేగిపోతోందని అక్కడ తక్షణమే శాంతిని నెలకొల్పాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ సీఎంపీ ఎస్ శర్మ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ నరసింగరావు, కె లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.కొండయ్య, ఎస్.గోవిందరాజులు, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి కె. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.